ఘనంగా గంగాళోత్సవం


సంతనూతలపాడులో వెంకటేశ్వరస్వామికి గంగాళోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

సంతనూతలపాడు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ధనుర్మాస వేడుకల్లో భాగంగా శనివారం 27వ రోజు గంగాళోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో తిరుప్పావు పారాయణం, విశేష అర్చన, కోడల్ కొంగల్ పూజ నిర్వహించారు. వేద పండితులు పి.శేష వరప్రసాద్ చార్యులు, పి.అజయ్‌కుమార్, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వార్లకు గంగాళోత్సవ పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెంచురత్నం, సెక్రటరీ శిఖాకొల్లి వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ జి. శరత్‌బాబు వేడుకలను పర్యవేక్షించారు. సీతారామస్వామి నిత్య భజన మందిర ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా గోదాదేవి, రంగనాయక స్వాములకు వైభవంగా గంగాళోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.నాగసాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య ఆలయ నిత్య భజన, మందిర కమిటీ, మహిళలు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. ఆర్యవైశ్య ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ శిఖాకొల్లి సత్యనారాయణ, సెక్రటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

కేవీ అగ్రహారంలో...

చీమకుర్తి రూరల్: మండలంలో కేవీ అగ్రహారంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 27వ రోజు ధనుర్మాస వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గోదాదేవి కళ్యాణ వ్రత మహోత్సవంలో గంగాళోత్సవం ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలతో పాటు అభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలలతో అలంకరించారు.

జీర్ణకోశ వ్యాధికి కిమ్స్‌లో అరుదైన చికిత్స


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్య బృందం

ఒంగోలు టౌన్: జీర్ణకోశ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్లో వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శనివారం కిమ్స్ వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీర్ణకోశ, కాలేయ వ్యాధి నిపుణుడు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. పొదిలి గ్రామానికి చెందిన 37 ఏళ్ల భవన నిర్మాణ కార్మికుడు కొంతకాలంగా జీర్ణకోశ వ్యాధితో బాధపడుతున్నారు. భోజనం, నీరు మింగడానికి కూడా తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం కిమ్స్ ఆస్పత్రిలోని జీర్ణకోశ, కాలేయ వ్యాధుల నిపుణుడు డాక్టర్ జగదీశ్వర్ రెడ్డిని సంప్రదించారు. డాక్టర్ అశోక్‌కుమార్‌తో కలిసి అతడికి వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి అన్నపేగు కండరం బిగుతుగా మారడం వలన ఈ సమస్య తలెత్తిందని నిర్ధారించారు. దీనికి కోత, కుట్టు లేకుండా అరుదైన ఎండోస్కోపీ విధానం ద్వారా బిగుతుగా ఉన్న కండరాన్ని సడలించారు. అతి తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలతో తక్కువ సమయంలో రోగికి చికిత్స చేసినట్లు వివరించారు. అరుదైన చికిత్సా విధానం ద్వారా జీర్ణకోశ సమస్య పరిష్కరించిన వైద్యుల బృందాన్ని కిమ్స్ ఈడీ గిరినాయుడు అభినందించారు. ఈ చికిత్స ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లోని కిమ్స్ హాస్పిటళ్లలో అందుబాటులో ఉందని తెలిపారు. జీర్ణకోశ, క్లోమ వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో హాస్పిటల్ సీఓఓ కె.అంకిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ టి.శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి ముందస్తు సంబరాలు


ఏకేవీకే కళాశాలలో భోగిమంటలు వేస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: సంక్రాంతి ముందస్తు సంబరాలను శనివారం పలు ప్రాంతాల్లో కోలాహలంగా నిర్వహించారు. ఒంగోలులోని ఏకేవీకే కళాశాల ఆవరణలో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సంబరాల్లో పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చిన్నపిల్లలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగిమంటలు వేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పల్లపు చెంచురామయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనీల్‌రెడ్డి, పీడీ హరిరామజోగయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరంజ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: పరంజ్యోతి కల్కి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం మద్దిపాడు బీసీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. సౌజన్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని సీతారామపురంలో శ్రీ లాస్య ప్రియ విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు తెలిపారు.


చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న పరంజ్యోతి కల్కి సేవా సమితి సభ్యులు

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక ఎస్ఆర్ గ్రూపు ఆఫ్ స్కూల్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్కూల్స్ అధినేత ములకా రామిరెడ్డి వేడుకలను ప్రారంభించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మారానికి ఘన స్వాగతం


వెంకారెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ జవహర్, అభిమానులు

చీమకుర్తి: డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్‌లో అవార్డు అందుకుని శనివారం చీమకుర్తిలోని తన ఇంటికి వచ్చిన ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డికి అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో అందించిన సేవలకు గుర్తుగా చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ ఆఫ్ యూనివర్శిటీ వారు అందించిన అవార్డు, ప్రశంసాపత్రాలను స్వీకరించిన అనంతరం మారం వెంకారెడ్డి చీమకుర్తి వచ్చారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.జవహర్‌తో పాటు మారం యూత్ ఫోర్స్ నాయకులు బడే దశరథరామిరెడ్డి, ఆలపాటి నరశింహారావు, దండు మధుసూదన్‌రెడ్డి, చింతకింది అశోక్, పేరం శ్రీనివాసరావుతో పాటు స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

గోకులం షెడ్‌లు ప్రారంభం

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంట సచివాలయం పరిధిలో మినీ గోకులం షెడ్‌లను ప్రారంభించినట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. శనివారం మువ్వవారిపాలెం, గోనుగుంట పంచాయతీల్లో మినీ గోకులం షెడ్‌లను ప్రారంభించిన తర్వాత అధికారులు రైతులతో మాట్లాడారు.